క్లుప్తంగా

దరఖాస్తుల పరిశీలన

చిట్టమూరు : బీసీ కార్పొరేషన్ రుణాల కోసం అభ్యర్థులు చేసుకున్న దరఖాస్తులను శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బ్యాంకు అధికారులు పరిశీలించారు. చిట్టమూరు మండలానికి బీసీ కార్పొరేషన్ కింద 23 యూనిట్లు మంజూరైనట్టు ఎంపీడీవో మనోహర్ గౌడ్ తెలిపారు. 226 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. బ్యాంకు మేనేజర్లు దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. చిట్టమూరు, గునపాడు, మల్లాం బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

చెరువుల్లో చేప పిల్లలు విడుదల

చిట్టమూరు/చిల్లకూరు/వాకాడు: చిట్టమూరు, చిల్లమూరు, వాకాడు మండలాల్లోని చెరువుల్లోకి శుక్రజువారం చేప పిల్లలను వదిలారు. పీఎంఎంఎస్‌వై పథకం కింద చేప పిల్లలను వదిలినట్టు మత్స్యశాఖ అధికారులు రఘుబాబు, రెడ్డినాయక్ తెలిపారు. చిట్టమూరు ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఫిషరీష్ అసిస్టెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ధర్నా



డెయిరీ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

పెళ్లకూరు : మండలంలోని పునబాక గ్రామంలో మూసేసిన వైష్ణవి డెయిరీ ఎదుట శుక్రవారం కార్మికులు ధర్నా చేశారు. కల్తీ నెయ్యి ఘటనకు సంబంధించి కేంద్ర దర్యాప్తు బృందం పలుమార్లు పరిశ్రమలో తనిఖీలు చేపట్టింది. దీంతో డెయిరీని మూసివేశారు. ఈ క్రమంలో అక్కడ పని చేసే కార్మికులకు జీతాలు చెల్లించలేదు. పని లేక, జీతాలు రాక కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వారు ప్రశ్నించారు. డెయిరీ ఎదుట బైఠాయించారు. కంపెనీ యాజమాన్యం పోలీసుల సమక్షంలో కార్మికులతో చర్చించి జీతాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దాంతో కార్మికులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో జగదీష్, బలరాం, విజయభాస్కర్, ముభారక్, గంగాధర్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు శీఘ్ర పరిష్కారం

దక్కిలి: రైతుల రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కేబీపల్లి పంచాయతీ భీమవరంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ నెల రోజులు చేపట్టిన భూ సర్వేలో రైతుల పొలాలు, ప్రభుత్వ భూములను గుర్తించినట్లు తెలిపారు. త్వరలో రీ సర్వే చేపడతామన్నారు. రైతులు తమ భూ రికార్డుల కోసం సాదా బైనామా కింద మ్యుటేషన్ చేసుకోవాలన్నారు. మ్యుటేషన్ చేసుకున్న ఐదు రోజుల్లోపు 1బీ, అడంగల్ వస్తాయని వివరించారు. అనంతరం ఆయన రీ సర్వేను పరిశీలించారు. సర్వేయర్ రాజగోపాల్, డీటీ ప్రసన్న పాల్గొన్నారు.

అట్రాసిటీ కమిటీ సభ్యులకు దరఖాస్తులు

చిల్లకూరు : సబ్ డివిజనల్ స్థాయి అట్రాసిటీ కమిటీ సభ్యులుగా ఎంపిక చేసేందుకు అర్హత ఉన్న వారు ఈ నెల 28లోగా దరఖాస్తులు చేసుకోవాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్ తెలిపారు. గతంలో కొన్ని కేటగిరీలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోలేదని, అందువల్ల మరోసారి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, నాన్ అఫిషియల్ సభ్యులు పోస్టులు-2, ఎస్సీ, ఎస్టీ కాని ఇతర కులాలకు చెందిన వారు (స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు) 2 పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మాణం



నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మండలం మేనకూరులో శుక్రవారం అధికార పార్టీ నేతలు భీమవరం వెళ్లే రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మించారు. ఇప్పటికే మామిడి కాలువను ఆక్రమించుకున్నారు. దీనిపై టీడీపీ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ పేరంశెట్టి శ్రీరామ్‌ప్రసాద్ సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. పరిశీలించి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. అయినా అక్రమార్కులు రెచ్చిపోతూనే ఉన్నారు. రోడ్డు అడ్డంగా గోడ కట్టిన విషయమై తహసీల్దారు రాజేంద్ర వివరణ ఇస్తూ రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మాణం చేయడంపై తగదన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రాపూరు: మండలంలోని గోనుపల్లిలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన కలకలం రేపింది. ఎస్‌ఐ వెంకట్‌రాజేష్ కథనం .. కలువాయి మండలం, ఎర్రబల్లికి చెందిన దుబ్బగుంట బుజ్జయ్య(41) గురువారం రాత్రి గోనుపల్లిలోని ప్రైవేటు వైద్యుని వద్దకు వచ్చి ఇంజెక్షన్ వేసుకున్నాడు. కొంతసేపటికి వాంతులయ్యాయి. వైద్యుడు మరో ఇంజెక్షన్ వేయడంతో మృతి చెందినట్లు బుజ్జయ్య అన్న పెంచలయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం బుజ్జయ్య మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందినట్టు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వివరించారు.

పట్టాల కోసం ప్రదక్షిణలు

దొరవారిసత్రం మండలంలోని పలు గ్రామాల్లో పేద రైతులకు ప్రభుత్వం కొన్నేళ్ల క్రితం భూములు పంపిణీ చేసింది. అందులో పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వాటికి పట్టాలు ఇవ్వాలని, హక్కులు కల్పించాలని రైతులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మండల స్థాయి నుంచి జిల్లా ఉన్నతాధికారుల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నా ఫలితం శూన్యం. పట్టాలు లేకపోవడంతో కొంత మంది ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

ఏకొల్లు రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 463లో పట్టాలు ఇచ్చి భూమి ఇదే



- భూములకు పట్టాలు ఇవ్వాలని స్థానికుల విన్నపం
- ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- రెవెన్యూ సదస్సుల్లో నిరసన తెలిపినా ఫలితం శూన్యం

దొరవారిసత్రం : దొరవారిసత్రం మండలం తనియాలి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 1లో వున్న 309.21 ఎకరాల భూమిని 1976లో 240 సబ్ డివిజన్లుగా చేసి 200 మందికి పైగా పంపిణీ చేశారు. వారిలో పలుకుబడి ఉన్న కొంతమందికి 20 ఏళ్ల క్రితం రెవెన్యూ అధికారులు పట్టాలు ఇచ్చారు. 2018లో మరి కొంత మందికి(ఓసీ, బీసీ) పట్టాలు ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీలకు ఇవ్వలేదు. పైగా కంచి పోరంబోకు భూమి అని రెవెన్యూ అధికారులు మెలిక పెట్టారు. దీంతో తనియాలి ఎస్టీ కాలనీకి చెందిన 28 కుటుంబాల వారు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. చివరికి గత ఏడాది డిసెంబర్‌లో తనియాలి గ్రామ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సు వద్ద నిరసనకు దిగారు. సాగులో ఉన్న భూమికి పట్టాలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. దీనిపై సంబంధిత రెవెన్యూ అధికారులు ఉన్నత అధికారులకు నివేదిక పంపాము. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పి చేతులు దులుపుకున్నారు.



తనియాలి ఎస్టీలు సాగు చేస్తున్న భూమి

మీజూరులోనూ అదే తంతు



మీజూరులో ఫారెస్టు శాఖ వారు అడ్డుకోవడం వలన బీడుగా మారి భూమి

మీజూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 183లో 422.72 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీన్ని పలు సర్వే నంబర్లుగా మార్చి 1990 నుంచి 2013 వరకు మీజూరు ఎస్సీ కాలనీకి చెందిన 200 మందికి పైగా ఒక్కొక్కరికి రెండు ఎకరాల చొప్పున పట్టాలు ఇచ్చారు. 2013లో కూడా సాగు చేస్తున్న భూములకే అసైన్‌మెంట్ కమిటీ సమావేశంలో పెట్టి 50 మందికి పైగా పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చారు. ఈ భూముల్లో పంటలు సాగు చేసుకోవడాన్ని వన్యప్రాణి విభాగం అధికారులు అడ్డుకుంటున్నారు. పట్టాదారులపై కేసులు పెడతామంటూ హెచ్చరిస్తున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు స్థానిక రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదు.

నెల్లూరుపల్లిలో 40 ఏళ్లుగా సాగు...

నెల్లూరుపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 54లోని సుమారు 40 ఎకరాల ప్రభుత్వ భూమిని 20 మంది 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. పట్టాలు ఇవ్వాలని పలుమార్లు రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు చుట్టూ తిరిగినా ఫలితం లేదు. గతంలో ఇదే సర్వే నంబరులో కొందరికి పట్టాలు ఇచ్చారు. ఇప్పుడు పట్టాలు ఇవ్వమంటే ఫారెస్టు భూములని రెవెన్యూ అధికారులు మాట దాటవేసి తప్పుకుంటున్నారు.

ఏకొల్లులో 25 ఏళ్లుగా పట్టాలు చేతపట్టుకుని...

ఏకొల్లు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 463లో ఏకొల్లు, కుప్పారెడ్డిపాళెం, డీవీ సత్రం గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు 150 మందికి ఒక్కొక్కరికి ఎకరా చొప్పున 150 ఎకరాలను పంపిణీ చేశారు. అప్పటి రెవెన్యూ అధికారులు సబ్ డివిజన్ వంటివి చేయకుండానే పట్టాలు ఇవ్వడంతో ఎవరి భూమి ఎక్కడ ఉందో తెలియక ఇబ్బంది పడుతున్నారు. తమకు భూమి చూపాలని ఏళ్ల తరబడి పట్టాలు చేత పట్టుకుని కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండాపోయింది.

పట్టాల కోసం తిరుగుతూనే ఉన్నాము



ఎకరా భూమికి పట్టా ఇవ్వాలని కొన్నేళ్లుగా తిరుగుతూనే ఉన్నాము. సదస్సుల్లో అర్జీలు ఇచ్చాము. ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. నా కంఠంలో ప్రాణం ఉండగా సాగులో ఉన్న భూమికి పట్టా వస్తుందో లేదో తెలియని పరిస్థితిలో ఉన్నాము.

– కోట్లపాటి పోలమ్మ, తనియాలి ఎస్టీ కాలనీ

రెండెకరాల భూమే ఆధారం



అప్పటిలో ప్రభుత్వం రెండు ఎకరాలు భూమి ఇచ్చింది. అందులో పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు ఫారెస్టు అధికారులు వచ్చి పులికాట్‌కు చెందిన భూములని, వ్యవసాయం పనులు చెయ్యనీయకుండా అడ్డుపడుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– గొంజి రమణమ్మ, మీజూరు ఎస్సీ కాలనీ

ఎవరూ పట్టించుకోవడం లేదు



నేను 40 ఏళ్లుగా నెల్లూరుపల్లి రెవెన్యూలోని సర్వే నంబరు 54లో రెండు ఎకరాల భూమిలో సాగు చేసుకుంటున్నాను. ఈ భూమికి పట్టా ఇవ్వాలని కొన్నేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుతున్నా పట్టించుకోడం లేదు. సదస్సులు, సమావేశాల్లో వినతులు ఇచ్చినా మా సమస్య పరిష్కారం కావడంలేదు.

– రాయిపాటి దేవరత్నం, నెల్లూరుపల్లి ఎస్సీ కాలనీ

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

దొరవారిసత్రం/వెంకటగిరి రూరల్: దొరవారిసత్రం మండలం మావిళ్లపాడు, వెంకటగిరిలోని ఆదర్శ పాఠశాలల్లో 2024-25లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాళ్లు సీహెచ్ సుమలత, తులసీ జ్యోతి తెలిపారు. ఈనెల 24 నుంచి 31వ తేదీలోపు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎంఎస్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని, ఏప్రిల్ 20 తేదీన పాఠశాలలో ప్రవేశ పరీక్షకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 7032996508, 9160995627, 9502097754 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

జేఎన్‌టీయూఏ హ్యాండ్‌బాల్ జట్టుకు ఎన్‌బీకేఆర్ విద్యార్థులు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ విద్యార్థులు జేఎన్‌టీయూఏ హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల పీడీ మల్లికార్జున్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. పులివెందులలో జరిగిన సెలక్షన్స్‌లో ప్రతిభ చూపి ఐ.ఇందువర్షిని, ఎం.ప్రసాద్ ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఫిబ్రవరి 25 నుంచి సేలంలోని పెరియార్ వర్సిటీలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రీడా పోటీల్లో జేఎన్‌టీయూఏ జట్టు తరపున పాల్గొంటారని వెల్లడించారు. వారిని కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి అభినందించారు.

గ్రావెల్ అక్రమ రవాణాకు చెక్



గ్రావెల్ తరలిస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శైలకుమారి

దొరవారిసత్రం: పూలతోటమిట్టలోని ప్రభుత్వ భూముల నుంచి గ్రావెల్ తరలించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని తహసీల్దార్ శైలకుమారి తెలిపారు. ఆమె శుక్రవారం ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కొంతమంది రాత్రిళ్లు ప్రభుత్వ భూమల నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. ఈ విషయాన్ని ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. వారి ఆదేశాల మేరకు పోలీసులతోపాటు వీఆర్వోను కాపలా ఉంచనున్నట్టు తెలిపారు.

వెంకటగిరి అభివృద్ధికి కృషి

కలువాయి: ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి వెంకటగిరి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. కలువాయి మండలం దాచూరులో అందే వసుందరమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త శ్రీరాములు శెట్టి నిర్మించిన కల్యాణ మండపాన్ని శుక్రవారం మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సొంత నిధులతో ప్రజల కోసం కల్యాణ మండపం నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ ప్రాంతంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, దాచూరు, పెంచలకోన అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఆదూరుపల్లి- పెంచలకోన రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. దాచూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. గ్రామంలో పోలేరమ్మ, చెన్నకేశవస్వామి ఆలయాల నిర్మాణానికి టెండర్లు పిలిచామని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. అనంతరం ముగ్గురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, డీసీసీబీ మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయ రెడ్డి, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ ఏలూరు కేశవచౌదరి, శ్రీరాములు శెట్టి, టీడీపీ మండల కన్వీనర్ గోనుగుంట వెంకటేశ్వర్లు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ మండపం ప్రారంభోత్సవంలో మంత్రి ఆనం, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

సైదాపురం: రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యతో కూడిన డిజిటల్ కార్డు ఉంటేనే భవిష్యత్తులో పథకాలు వర్తిస్తాయని ఏవో పి.హైమావతి తెలిపారు. ఆమె శుక్రవారం మర్లపూడి ఆర్బీకేను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా అందించేందుకు డిజిటల్ గుర్తింపు కార్డులు ఇస్తున్నట్టు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

సైదాపురం: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం చాగణం, సైదాపురం గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేలపై ఆరా తీశారు. ప్రజలకు సత్వరమే సేవలు అందించేలా చొరవచూపాలన్నారు.

రమణమ్మకు నివాళి

వాకాడు : మండల కేంద్రమైన వాకాడు దళితవాడకు చెందిన ఇంగిలాల రమణమ్మ శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అక్కడకు చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి కుమారుడు, ఉపాధ్యాయుడు ఇంగిలా మస్తానయ్యను పరామర్శించారు. అలాగే గొల్లపాళెంకు చెందిన పాపారెడ్డి సుబ్రమణ్యం రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పాపారెడ్డి మనోజ్‌కుమార్‌రెడ్డిని పరామర్శించారు. నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రమణమ్మ మృతదేహంపై పూలమాల వేస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్ల అడ్డగింత



రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు



పోలీసులతో గ్రామస్తుల వాగ్వాదం

ఓజిలి: మండలంలోని ఆర్మేనిపాడు సమీపంలోని కొండ వద్ద క్వారీ నిర్వహణకు అధికారులు అనుమతి ఇచ్చారు. ఈ క్రమంలో క్వారీ యజమానులు గ్రావెల్‌ను తరలిస్తుండగా టిప్పర్లను శుక్రవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ క్వారీ వల్ల తమ గ్రామంలోని మూడు చెరువులకు కొండపై నుంచి వర్షపు నీరు వచ్చే అవకాశం ఉండదన్నారు. తద్వారా పంటలు ఎలా పండించుకోవాలని ప్రశ్నించారు. క్వారీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో 500 కుటుంబాలకు పైగా పాడి రైతులు ఉన్నారని తెలిపారు. కొండల్లో గుంతలు పెడితే మూగజీవాలకు మేత ఎక్కడ లభిస్తుందని మండిపడ్డారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే విజయశ్రీకి తెలిపామని, క్వారీ అనుమతులు రద్దు చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారని తెలిపారు. కొద్దిరోజులు గ్రావెల్ తరలించకుండా నిలిపేసిన క్వారీ యజమానులు నాలుగు రోజుల నుంచి పోలీసుల సహకారంతో గ్రావెల్‌ను తరలిస్తున్నారని దుయ్యబట్టారు. దీంతో పోలీసులు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. గ్రామస్తులు టిప్పర్లను అడ్డుకుని అక్కడే వంటావార్పు చేసుకుని నిరసన తెలిపారు. క్వారీ అనుమతులు రద్దు చేయకుంటే ఆత్మహత్యలకు వెనకాడబోమని హెచ్చరించారు.

గౌతమ్‌రెడ్డి సేవలు మరువలేనివి



మేకపాటి గౌతమ్ రెడ్డికి నివాళులర్పిస్తున్న సంజీవయ్య

నాయుడుపేట టౌన్ : మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని పొందా రని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. నెల్లూరులోని మేకపాటి నివాసం వద్ద శుక్రవారం గౌతమ్ రెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఇందులో సంజీవయ్య పాల్గొని గౌతమ్‌రెడ్డి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఓట్టురు కిషోర్ యాదవ్, కటకం జయరామయ్య, గంధవళ్లి సిద్ధయ్య, నాగిరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, పాలేటి నాగార్జున, షేక్ షబ్బీర్, తన్నమాల రమణ య్య, వరకళాచంద్ర, ఆకుతోట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మాతృభాషపై మమకారం పెంచుకోవాలి



గూడూరు రూరల్ : అష్టావధానం చేస్తున్న పంచ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్

- పంచ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్

గూడూరు రూరల్ : మాతృ భాషపై ప్రతి ఒక్కరూ మమకారం పెంచుకోవాలని పంచ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ తెలిపారు. గూడూరు లోని ఎస్‌వీ ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరు అపస్మా, మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ సౌజన్యంతో అష్టావధానం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ భాషల్లో అవధాన ప్రక్రియ తెలుగు భాషలోనే ఉందన్నారు. విద్యార్థులు మాతృ భాష ద్వారా ధారణా శక్తిని ఎలా పెంపొందించుకోవచ్చో వివరించారు. అనంతరం పృచ్ఛకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్, డాక్టర్లు సీఎంకే రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రోహిణి, ప్రొఫెసర్ నిరంజన్‌రెడ్డి, డాక్టర్ టేకుమళ్ల వెంకటయ్య, తంగిరాల వెంకట నరసింహారావు, పాలవరపు లక్ష్మీ నరసింహారావు, డాక్టర్ ఎస్.మమత, పి.లోకేశ్వరి, ఉమేష్, కార్య నిర్వాహకులు గంగిశెట్టి శివకుమార్, కళాశాల కరస్పాండెంట్ కేఆర్ రెడ్డి, బాలకృష్ణంరాజు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

మాతృభాషను గౌరవించాలి

చిల్లకూరు : ప్రతి ఒక్కరూ మాతృభాషను గౌరవించాలని పారిచెర్లవారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ప్రజేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పాఠశాలలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా తెలుగు భాష గొప్పతనంపై విద్యార్థులు నృత్య రూపకం ప్రదర్శించారు. అనంతరం క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు మాధవయ్య, ముంజుశ్రీ, డీవీ రమణయ్య, చిన మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు

నాయుడుపేట టౌన్ : జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న ప్రభుత్వ భుములు అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక నిఘా పెట్టాలని రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం విజయవాడ నుంచి తిరుపతి వెళుతూ నాయుడుపేట రెవెన్యూ కార్యాలయం వద్దకు వచ్చారు. హైవే, రింగ్ రోడ్డు తదితరాలను పరిశీలించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ రాజేంద్ర, ఆర్‌ఐ సాయితేజ, సర్వేయర్ చరణ్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించాలి

చిల్లకూరు : గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లోని ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు కోరారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన అట్రాసిటీ కమిటీ సభ్యుల సమావేశంలో వారు పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం ఇచ్చిన భూములను కొంతమంది ఆక్రమించుకుంటున్నారని, దీనిపై విచారణ చేపట్టాలని కోరారు. గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనన్, డీఎస్పీ గీతాకుమారి పాల్గొన్నారు.

ఇంటి కొళాయి కనెక్షన్లు కట్

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని అధిక మొత్తంలో పేరుకు పోయిన ఇంటి, నీటి పన్నుల వసూలుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ షేక్ ఫజులుల్లా తెలిపారు. 25వ వార్డులో శుక్రవారం బకాయిలు ఉన్న ఇళ్లు, దుకాణదారులను కలిసి పన్నులు వసూలు చేశారు. చెల్లించని వారి ఇళ్లు, దుకాణాలకు ఉన్న తాగునీటి కొళాయిల కనెక్షన్లు తొలగించారు.

నారాయణ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

సూళ్లూరుపేట : కాలం చెల్లిన బస్సులు నడుపుతున్న నారాయణ స్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారిని కలిసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ సూళ్లూరుపేటలోని నారాయణ స్కూల్ బస్సు కండీషన్ లేకపోవడంతోనే అదుపుతప్పి బోల్తాపడిందన్నారు. అందులో 30 మంది పిల్లలు ఉన్నట్టు తెలిపారు. ప్రాణనష్టం జరగలేదని, యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. పాఠశాల యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి హెచ్.లోకేష్, వైఎస్సార్‌ఎస్‌వీయూ అధ్యక్షుడు మన్నం ప్రేమ్‌కుమార్, ఏపీవీహెచ్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ముని తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకే పెద్ద పీట

సూళ్లూరుపేట : మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా 2025–26 సంవత్సరానికి రూ.2,01,01,153లతో బడ్జెట్ ప్రవేశపెట్టినట్టు మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం తదితరాలకు రూ.రెండు కోట్లు కేటాయించారు. వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ మాట్లాడుతూ బజారు వీధుల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వుందన్నారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేకంగా స్థలం కేటాయించాలన్నారు. జీఎన్‌టీ రోడ్డు ఇరువైపులా ఆక్రమణలను తొలగించాలని కోరారు. చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యపై అందరికీ అవగాహన సమావేశాన్ని నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ చిన్నయ్య, వైస్ చైర్మన్ పోలూరు పద్మమిల్టన్, మున్సిపల్ విభాగం అధ్యక్షులు మీజూరు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ శ్రీమంత్‌రెడ్డి

ఘాట్ రోడ్డులో రక్షణ గోడల పరిశీలన

రాపూరు: రాపూరు–చిట్వేలి ఘాట్ రోడ్డులో పలు మలుపుల వద్ద పడిపోయిన రక్షణ గోడలను శుక్రవారం ఆర్ అండ్‌బీ అధికారులు పరిశీలించారు. రాపూరు నుంచి చిట్వేలి రోడ్డులోని సరిహద్దు వరకు పలు రక్షణగోడలు పడిపోయి ఉన్నాయి. పొరపాటున ప్రమాదం సంభవిస్తే వాహనాలు కొండ లోయలోకి పడిపోయే అవకాశం ఉంది. దీంతో వాహనదారులు, డ్రైవర్లు ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. రక్షణ గోడలు నిర్మించాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకునే నాథుడు లేడని వాపోతున్నారు. ఆర్‌అండ్‌బీ ఏఈ మనోహర్ మాట్లాడుతూ రక్షణ గోడల నిర్మాణానికి రూ.1.85 కోట్లు, సీసీ బర్మ్స్‌కు రూ.1.55 కోట్లు, పిట్టగోడలకు రూ.5 లక్షలతో ప్రతిపాదనలు పంపామని, మంజూరైన వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు.



పడిపోయిన రక్షణ గోడలను పరిశీలిస్తున్న మనోహర్